క్లుప్తంగా

ఘనంగా వీరభద్రుని కల్యాణం



పెదపూడిలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

పెదపూడి: పెదపూడి గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి వారికి ప్రత్యేక, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణం కనులారా తిలకించి పరవశితులయ్యారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతినిధులు ఈదేటి వీర్రాజు, కాకర సాయిబాబు, ఈదేటి సూర్యరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేల్పులమ్మ తీర్థ మహోత్సవం



చంద్రేడులో వేల్పులమ్మ తల్లి

రంగంపేట: చంద్రేడు గ్రామ ప్రధాన రహదారిలో వేంచేసి ఉన్న గ్రామ దేవత వేల్పులమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవతల స్వరూపమైన గరగలతో నిర్వహించిన గ్రామోత్సవం గ్రామస్తులను ఆకట్టుకుంది. గ్రామంలోని ఇంటింటికీ గరగలను తీసుకెళ్లడంతో గ్రామస్తులు గరగలకు పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించారు.

జోరుగా జీడిపిక్కల విక్రయాలు



ఏడీబీ రోడ్డు పక్కన విక్రయిస్తున్న జీడిపిక్కలు

రంగంపేట: రంగంపేట గ్రామ శివారు ఏడీబీ రోడ్డు పక్కన పచ్చి జీడిపిక్కల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎండి జీడిపప్పు సీజన్‌తో సంబంధం లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు ప్రతి దుకాణంలో దొరుకుతుంది. అయితే పచ్చి జీడిపప్పు మాత్రం ఈ సీజన్‌లోనే లభిస్తుంది. ఎండి జీడిపప్పు కంటే ఎంతో అద్భుత రుచి గల పచ్చి జీడిపప్పు పిక్కలు ఏడీబీ రోడ్డు పక్కన వ్యాపారులు విక్రయిన్నారు. మండలంలోని కోటపాడు, వెంకటాపురం, జి.దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, సింగంపల్లి, నల్లమిల్లి తదితర గ్రామాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల్లోని పచ్చి జీడిపిక్కలను రైతులు, వ్యాపారులు ఏడీబీరోడ్డు పక్కన అమ్ముతున్నారు. పచ్చి జీడిపప్పు కూర ఎంతో రుచికరంగా ఉంటుంది. దీంతో వీటికి డిమాండ్ ఉంటుంది. కిలో పచ్చి జీడిపిక్కలు రూ.150కు విక్రయిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు ప్రజలు, రోడ్డుపై ప్రయాణికులు జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

కంబాలచెరువు: అకడమిక్ కేలండర్‌లో ప్రభుత్వం సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలలు పనిచేయాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలపై వచ్చిన సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చి, ఈ విద్యా సంవత్సరంలో అవి పునరావృతం కాకుండా చూడాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్‌కు ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆన్‌లైన్ హాజరును ఎట్టి పరిస్థితుల్లోనూ 10 గంటల లోపు విధిగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలు పూర్తి అయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బస్సుల ఫిట్‌నెస్‌ను సెలవుల్లో నిర్ధారించుకోవాలన్నారు. విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం నివ్వాలన్నారు. కార్యాలయానికి అందించాల్సిన రిపోర్టులన్నీ ఈ నెల 5వ తేదీలోపు సబ్మిట్ చేయాలన్నారు.

తాగునీటి లక్ష్యం.. సంపూర్ణ సాకారం

- వేసవికి ముందే ట్యాంకుల నిర్మాణం
- ప్రజలందరికీ రక్షిత నీటి సరఫరా

మధురపూడి: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సరైన ప్రణాళికతో అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. దీంతో నియోజకవర్గంలో ప్రజలకు రక్షిత తాగునీరు అందడంతో పాటు వేసవి సమయంలో గతంలో పడిన ఇబ్బందులకు పరిష్కారం లభించింది. రాజానగరం నియోజకవర్గంలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం జరిగింది. నియోజకవర్గంలోని సుమారు 70 గ్రామాల్లో 70 ఓవర్ హెడ్ ట్యాంకులు, 30 జీఎల్ఆర్ ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. మనిషికి రోజుకు 55 లీటర్ల నీరందించే లక్ష్యంతో పంపిణీ చేస్తున్నారు.

పలు పథకాలతో..

నియోజకవర్గంలో సింగిల్ విలేజ్ స్కీమ్ (ఎస్‌వీఎస్)లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేశారు. వీటి ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో నీటి సరఫరా జరుగుతోంది. సుమారు 20 వేల లీటర్ల నుంచి 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులను నిర్మించారు. వేసవి రాకముందే వీటిని పూర్తి చేయడంతో ఇప్పుడు సక్రమంగా నీటి సరఫరా జరుగుతోంది. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ట్యాంకులను నిర్మించారు. వాటికి తగిన విధంగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 6 నుంచి 11 వరకూ, సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకూ నీటి సరఫరా చేస్తున్నారు. అలాగే కోరుకొండ, సీతానగరం మండలాల్లోని గ్రామాలకు సత్యసాయి స్కీమ్ ద్వారా రక్షిత నీరు అందజేస్తున్నారు. రాజానగరం మండలానికి కడియం స్కీమ్ ద్వారా తాగునీరు పంపిణీ చేస్తున్నారు.



దివాన్ చెరువులో ఓవర్‌హెడ్ ట్యాంకు



గాదరాడలో రక్షిత తాగునీటి పథకం

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేగవంతంగా పనులు పూర్తి చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కూడా పనులు చేపట్టారు. వేసవి ప్రారంభానికి ముందే ట్యాంకులు అందుబాటులోకి వచ్చాయి.

– ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ప్రజల ఆరోగ్యానికి రక్షిత తాగునీరు చాలా అవసరం. దీనిని ప్రతి ఒక్కరికీ అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నియోజకవర్గంలో ట్యాంకులు నిర్మించి, పైపులైన్లను ఏర్పాటు చేసింది. ప్రతి మనిషికీ రోజుకు 55 లీటర్ల నీరందించాలన్న లక్ష్యంతో పనులు జరిగాయి.

– తాడి రజని

అభివృద్ధికి చిరునామా జక్కంపూడి రాజా



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ గాదరాడ నాయకులు

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధికి చిరునామాగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిలిచారని, ఐక్యతకు చిరునామాగా గాదరాడ వైఎస్సార్ సీపీ నాయకత్వం ఉందని గాదరాడ మాజీ ఎంపీటీసీ సభ్యుడు హరిబోలు చినబాబు అన్నారు. అభివృద్ధి విషయంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణకు సవాల్ విసిరారు. కోరుకొండ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గాదరాడ వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గాదరాడ అంధకారమయంగా, అస్తవ్యస్తమైన రోడ్లతో ఉందన్నారు. 2 ఓహెచ్ఎల్ఆర్, 1 జీఎల్ఆర్ ట్యాంకులు, రూ.1.50 కోట్లతో నాడు–నేడు కార్యక్రమంలో హైస్కూల్‌ను తీర్చిదిద్దిందెవరని ప్రశ్నించారు. చీర్ల శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేకే బత్తుల బలరామకృష్ణ లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు జనసేన జెండాలు, శ్రేణులు లేకుండా గాదరాడలో ఎందుకు ప్రచారం నిర్వహించారని ప్రశ్నించారు. గొల్లవిల్లి అశోక్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తరఫున గాదరాడ ఎంపీటీసీగా గెలిచి నేటికీ రాజీనామా చేయకుండా నిసిగ్గుగా జనసేనకు మారారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ఇప్పటికైనా రాజీనామా చేసి, జనసేన తరఫున ఎంపీటీసీగా గెలవాలని సవాల్ విసిరారు. సమావేశంలో మామిడి సత్యనారాయణ, పిల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతు తెలపండి



సంపత్ నగరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్

- అధికారం కోసమే ప్రతిపక్షాల కుయుక్తులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు చేసి, జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలన కొనసాగేలా చూసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సంపత్‌నగరంలో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండు టెండను సైతం లెక్క చేయకుండా ప్రచార రథంపై రోడ్ షో చేశారు. గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన జరిగిందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు నిర్ణీత సమయంలోనే అందాయన్నారు. ఎన్నికల పేరు చెప్పి గత రెండు నెలలుగా పింఛన్ల తీసుకోవడానికి వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతిపక్షాలకు అధికారం తప్ప ప్రజా సంక్షేమం అవసరం లేదన్నారు. పొరపాటున వారు అధికారంలోకి వస్తే గతంలో మాదిరిగా ప్రతి చిన్నపనికీ కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్



పీరా రామచంద్రపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి



అనపర్తి ధరణికోటలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పీరా రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ ప్రచారం

అనపర్తి: మాట తప్పని, మడమ తిప్పని నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తనయుడు ప్రముఖ వైద్యుడు సత్తి గౌతమ్‌రెడ్డి అన్నారు. గురువారం పీరా రామచంద్రపురంలో తన తండ్రికి మద్దతుగా గౌతమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిష్పక్షపాతంగా సుపరిపాలన సాగించారన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు కుల మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని అన్నారు. పేదరికం లేని సమాజం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించిన వైఎస్సార్ సీపీని గెలిపించడం ద్వారా మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అవినీతి రహితంగా పాలన అందించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాసరావును రాజమహేంద్రవరం ఎంపీగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గౌతమ్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు నవరత్న పథకాలపై అవగాహన కల్పిస్తూ ఓట్లు అభ్యర్థించారు. సర్పంచ్ తేతలి సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కేఎస్ఎన్, నాయకులు కోనాల సాయిరామారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి నాగిరెడ్డి, నల్లమిల్లి సాయిరామారెడ్డి, తమలంపూడి సత్యనారాయణరెడ్డి, తాడి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మద్దతుగా స్థానిక ధరణికోటలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేయండి



కానవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కానవరంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థించారు.

సంక్షేమ పథకాల అమలులో ఆడపడచులకు అధిక ప్రాధాన్యతనిచ్చిన జగనన్నను మరోసారి సీఎంగా చేయాల్సిన బాధ్యత మహిళలదేనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మహిళలు ప్రగతి పథంలో పయనించగలరన్నారు.

ఎన్నికల పరిశీలకుని పర్యటన

కడియం: మండలంలోని పొట్టిలంక సచివాలయం 2ను ఎన్నికల పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. ఎన్నికల నిర్వహణ, కార్యాచరణకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పొట్టిలంకలోని మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆయన వెంట జేసీ తేజ్ భరత్, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, తహసీల్దార్ రమాదేవి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విజయవంతంగా హోం ఓటింగ్



హోం ఓటింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధురాలు

అనపర్తి: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హోం ఓటింగ్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ హోం ఓటింగ్ ప్రక్రియను నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి తెలిపారు. ఎలక్షన్ కమిషన్ వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని వారికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించింది. ఈ హోం ఓటింగ్‌లో నియోజకవర్గ పరిధిలో మొత్తం 396 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్ఓ తెలిపారు. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల పరిధిలో మొత్తం 408 మంది హోం ఓటింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోగా వీరిలో 11 మంది మరణించినట్లు తెలిపారు. మిగిలిన 397 మందిలో 396 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 8న జరిగే రెండో విడత హోం ఓటింగ్‌లో మిగిలిన ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కృషి చేస్తామన్నారు. హోం ఓటింగ్‌కు సంబంధించి నియోజకవర్గంలో 21 బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

బిక్కవోలు: మండలంలోని హోం ఓటింగ్‌ను గురువారం ప్రశాంతంగా పూర్తి చేసినట్లు అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి తెలిపారు.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తహసీల్దార్, ఏఆర్వో కె.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో 82 మంది హోమ్ ఓటర్లు ఉండగా, 80 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.

సెబ్ దాడుల్లో 48 మంది అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి విస్తృతంగా దాడులు నిర్వహించామని సెబ్ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.నెక్సన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకూ 228 కేసులు నమోదు చేశామని, వాటిలో 56 సారా, బెల్లపుఊటకు సంబంధించిన కేసులన్నారు. దాడుల్లో 4,654 లీటర్ల సారా, 200 కేజీల బెల్లం, 20 కేజీల అమ్మోనియా, 13 కేజీల ఈస్ట్, మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని 48 మందిని అరెస్టు చేశామని, 46,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. పన్నులు చెల్లించని (ఎన్‌డీపీఎల్) మద్యంపై రెండు కేసులను నమోదు చేసి 6.5 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అనధికార పన్ను చెల్లించిన మద్యంపై 162 కేసులను నమోదు చేసి, 162 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 159.5 లీటర్ల అక్రమంగా పన్ను చెల్లించిన మద్యం సీసాలను, 1099.55 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. పాత నేరస్తులు 240 మందిని 110 సీఆర్‌పీసీ కింద తహసీల్దార్లకు బైండోవర్ చేశామన్నారు.


80 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం సెబ్ సౌత్ స్టేషన్ పరిధిలోని గురువారం విస్తృత దాడు లు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. రాజానగరం మండలం భూపాలపట్నానికి చెందిన సిద్దబత్తుల సూర్యారావు, కవలగొయ్యికి చెందిన మేడి శెట్టి గణేష్‌ను అరెస్టు చేసి రెండు కేసులు నమోదుచేశామన్నారు. వారి నుంచి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 1720 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.


ఆర్ట్స్ కళాశాలలో గణితం సర్టిఫికెట్ కోర్సులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో నూతన విద్యా సంవత్సరంలో రెండు గణితం సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. వాటికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. మ్యాథమెటిక్స్ ఫర్ మిషన్ లేర్నింగ్, ఇంట్రడక్షన్ ఇన్ మాట్ లాబ్ అనే కోర్సులను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, భవిష్యత్తులో ఉన్నత విద్యావకాశాలతో పాటు ఉపాధిని పొందడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల గణిత శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎ.అన్నపూర్ణ, అకడమిక్ సెల్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్, ఇతర గణిత శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

వేసవి ఎండలతో జాగ్రత్త



డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో



రాజమహేంద్రవరం రూరల్: ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులను ఆయన వివరించారు. ఎండాకాలంలో వేడి వల్ల చాలామందిలో మైకం, భయం, వికారం వంటి లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకూడదు. ముఖ్యంగా పగటి పూట 12 నుంచి 3 గంటల వరకు నీడపట్టున ఉండడం మంచిది. ఎందుకంటే ఈ సమయంలో సూర్య కిరణాల వేడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఎండలోకి వెళితే అలసిపోయి కిందపడిపోవడం, చంచలంగా అనిపించడం, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు ఉంటాయి.

జాగ్రత్తలు పాటించాలి

- శరీరం ఎక్కువగా అలసిపోకుండా చూసుకోవాలి.
- ఇంటి నుంచి బయలుదేరే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ లేదా లస్సీ వంటివి తాగాలి.
- తల, చెవులను కప్పుకున్న తర్వాత మాత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లాలి. గొడుగును ఉపయోగించాలి, వాటర్ బాటిల్ దగ్గర ఉంచుకోవాలి. తాగే నీళ్లలో కాస్త బ్లాక్ సాల్ట్, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే మంచిది.
- ఏసీ నుంచి డైరెక్ట్‌గా ఎండలోకి వెళ్లకూడదు. ఎండలో తిరిగివచ్చి డైరెక్ట్‌గా ఏసీ గదికి వెళ్లకూడదు. కొంచెం సమయం తీసుకున్న తర్వాత వెళ్లాలి. తద్వారా శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.
- స్థానిక సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి.

వడదెబ్బ – లక్షణాలు

- వడదెబ్బకు గురైతే కొంచెం మైకంతో పాటు తల తిరుగుతున్న అనుభూతి ఉంటుంది. ఏకాగ్రత ఉండదు. బలహీనత, కండరాల నొప్పి ఉంటుంది.
- విపరీతమైన దాహం, కడుపులో తిప్పుతున్నట్లు అనిపిస్తుంది. వాంతులు, విరేచనాలు అవుతాయి.

ప్రథమంగా చేయాల్సిన పనులు

- వడదెబ్బ లక్షణాలు కనిపించగానే ఆ వ్యక్తిని చల్లని చోటుకు చేర్చడంతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం, గంటకు ఒక గ్లాసు చొప్పున నీరు తాగించాలి. బాగా ఎండలో పనిచేసే వారైతే గంటకు రెండు గ్లాసుల నీరు తాగించాలి. ఆ వ్యక్తి ఉన్న గదిని చల్లబరిచే ప్రయత్నం చేయాలి.
- శరీరాన్ని చల్లబరిచే పుచ్చకాయలు, కొబ్బరి నీరు, తాటి ముంజెలను ఇవ్వాలి. ఇంటిదగ్గర లభ్యమయ్యే ద్రవాలు, అవసరమనుకుంటే రెండు చెంచాల పంచదార, చిటికెడు ఉప్పు కలిపి తీసుకోవచ్చు.
- నీళ్లల్లో ముంచి పిండిన తడి వస్త్రాన్ని మెడ, ఛాతీ పొట్ట భాగాలకు చుట్టవచ్చు. అయితే అది కొంత పొడిబారగానే దాన్ని తీసివేసి వేరే వస్త్రం చుట్టాలి. అంతే తప్ప వేసిన వస్త్రాన్ని అలాగే ఉంచేయకూడదు.
- వడదెబ్బకు గురైన వాళ్లల్లో చాలామంది నీళ్లు తాగే స్థితిలో ఉండరు. అలాంటప్పుడు పీహెచ్‌సీలో ఐవీ ద్వారా ద్రవాలను ఎక్కించాలి.కోలుకున్న తర్వాత కూడా కొంతమందిలో మెదడు, గుండెపై వడదెబ్బ ప్రభావం ఉంటుంది. కొంత కాలం చికిత్స కొనసాగించాలి.

లక్ష్య సాధనపై దృష్టి సారించాలి



వేడుకల్లో మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ జోన్-2 ప్రాంతీయ సంచాలకులు నాగమణి

రాజమహేంద్రవరం రూరల్: లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు కృషి చేయాలని ఛాత్రోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ జోన్ – 2 ప్రాంతీయ సంచాలకులు జి.నాగమణి సూచించారు. బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో వార్షిక దినోత్సవం, 2022–24 బ్యాచ్ వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి.నాగమణి మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు నిరంతరం శ్రమించి రాబోయే డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఏదో ఒక ఉద్యోగం వచ్చిందని అనుకోకుండా, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రాంతీయ సంచాలకులు నాగమణిని ఆదర్శంగా తీసుకుని తాను పయనిస్తున్నానని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అన్నారు. సీనియర్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ వీరభద్రరావు ఆధ్వర్యంలో ఛాత్రోపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులను ఆర్జేడీ నాగమణి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.